


పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు

కాళేశ్వరం కంచికేనా?

ప్రభుత్వ శ్వేతపత్రంతో ప్రాజెక్టు భవితవ్యంపై నీలినీడలు

"కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంలో కాళేశ్వరాన్ని ఓ పనికి రాని ప్రాజెక్టుగా ప్రభుత్వం అభివర్ణించింది. కాగ్ నివేదికలోనూ గత ప్రభుత్వం అవసరానికి మించి ఖర్చు చేసిందని పేర్కొంది. వీటన్నింటికి తోడు కుంగిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు సీపేజీలతో లీకేజీలు అవుతున్న అన్నారం బ్యారేజీల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి మరమ్మతులకు నిధుల కొరత ఏర్పడుతోంది. అలాగే 2022 జూలై వరద లకు నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లో 17మోటర్లకు కేవలం ఆరు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. మిగతా మోటర్ల పరిస్థితేంటి? వీటికి మరమ్మతులు చేసేదెవరు? అనేది చర్చనీయాంశంగా మారింది. దీంతో అసలు కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన ఈ కట్టడాలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగా మాత్రమే పనికి వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి."

- అన్నారం బ్యారేజీ కూడా కుంగిపోనుందా!!
- ఇప్పటికే సీపేజ్‌లతో బ్యారేజీల నుంచి నీళ్లు లీక్
- మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడంతో గేట్లెత్తిన అధికారులు
- వరదలకు మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లోని 17మోటార్లలో పనిచేసేవి ఆరే..
- ప్రాణహిత-చేవెళ్ల వైపే ప్రభుత్వం మొగ్గు
- కాళేశ్వరం.. పర్యాటక ప్రాంతంగానే మిగిలిపోతుందని అనుమానాలు

వరంగల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. 2016 మే 2వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. రూ.84వేల కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును నిర్మించి ప్రారంభించారు. తొలుత రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు ప్రతి ఏటా 180 టీఎంసీల నీటిని గోదావరి నీటిని ఎత్తిపోయా లని లక్ష్యంగా పెట్టుకున్నారు. 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించటంతో పాటు మరో 18,82,970 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ మండలం కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డ వద్ద గోదావరిపై ఆనకట్ట నిర్మించారు. 16.17టీఎంసీల నీరు మేడిగడ్డ వద్ద నిల్వ చేసి కన్నెపల్లి పంపహౌస్‌లో ఏర్పాటు చేసిన 17 మోటర్లతో ఎత్తిపోయాలని నిర్ణయించా రు. 2019 జూన్ 21న ఈ ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ ప్రజలకు అంకి తం చేయగా.. ఆ సమయంలోనే మూడో టీఎంసీ నీటిని ఎత్తిపోసే పనులకు కూడా శ్రీకారం చుట్టారు. దీంతో అంచనా వ్యయం రూ.1.47లక్షల కోట్లకు పెరిగింది. ఆయక ట్టును కూడా 45లక్షలకు పెంచారు. అయితే 2019 నుంచి 2023 వరకు కేవలం 164టీఎంసీల నీటినే ఎత్తిపోశారు. అంతేకాకుండా కేవలం 94 వేల ఎకరాల ఆయకట్టుకు నీరం దించారు. దీంతో పాటు ప్రాజెక్టు కోసం భూములను త్యాగం చేసిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ రైతులకు చెందిన ఇతర భూములకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎకరం భూమికి కూడా చుక్క నీరందదు. ఉమ్మడి వరం గల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా కాళేశ్వరం నీళ్ల రైతులకు అందటమే కొంత ఊరట.



నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్ (ఫైల్)




అన్నారం బ్యారేజీలో బుడగలు (ఫైల్)

మునిగిన పంప్‌హౌస్.. కుంగిన బ్యారేజీలు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైనవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కన్నెపల్లి, సుందిళ్ల పంపుహౌస్‌లు. అయితే 2022 జూలై 14వ తేదీన వచ్చిన వరదలకు కన్నెపల్లి, సుందిళ్ల పంపహౌస్‌లు నీట మునిగాయి. సుందిళ్ల పంప్‌హౌస్‌కు పెద్దగా నష్టం లేకున్నప్పటికి కన్నెపల్లి పంప్‌హౌస్‌లో భారీ నష్టం వాటిల్లింది. పంపుహౌస్‌లో ఉన్న పెద్ద క్రేన్‌లు విరిగి అందులో ఉన్న 17మోటర్లపై పడిపోయాయి. ఆ ఘటనలో 7మోటర్లు పూర్తిగా దెబ్బతినగా, 4మోటర్లకు పాక్షింగా నష్టంవాటిల్లింది. అప్పటి నుంచి కన్నెపల్లి పంపుహౌస్‌లోకి ప్రవేశాలను గత ప్రభుత్వం నిషేధించింది. దీంతో లోపల ఏం జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం 17 మోటర్లలో కేవలం ఆరు మోటర్లు మాత్రమే పని చేస్తున్నట్టు

మిగతా 6వ పేజీలో..



అన్నారం బ్యారేజీ 10 గేట్ల ఎత్తివేత

- ఫౌండేషన్ టెస్టుల కోసం 7వేల క్యూసెక్కుల నీరు విడుదల
- ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల మేరకు పరీక్షలు

మహదేవపూర్ / మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 17 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన అన్నారం(సరస్వతీ) బ్యారేజీ నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో 20వ పిల్లరు కుంగిన నేపథ్యంలో జాతీయ ప్రాజెక్టుల రక్షణ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ పరిశీలించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన పార్సన్ కంపెనీతో ఫౌండేషన్ టెస్టులు చేయించేందుకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో బ్యారేజీలో శనివారం ఉదయం 2.06 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 10గేట్లను 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఒకేసారి పూర్తినీటిని విడుదల చేస్తే దిగువన కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వదులుతున్నామన్నారు. వచ్చేది వేసవి అయినప్పటికీ తప్పని సరి పరిస్థితుల్లో నీటిని విడుదల చేయాల్సి వస్తోందన్నారు.



వన దేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వనదేవతల దర్శనానికి..

లక్షలాదిగా మేడారానికి తరలొస్తున్న భక్తులు



వనజాతరకు మరికొద్దిరోజులే సమయమున్న నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వనదేవతల దర్శనానికి తరలొస్తున్నారు. ఈ క్రమంలో శనివారం లక్షమందికి పైగా జనం మేడారం వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి తల్లుల సన్నిధికి చేరుకుంటున్న భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించి.. సమ్మక్క సారలమ్మ గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరసారె సమర్పించుకుంటున్నారు. యాట మొక్కులు చెల్లించుకుంటున్నారు. లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

- మేడారం

భక్తులకు మెరుగైన సేవలందించాలి



- వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : మంత్రి సీతక్క
- మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష
- వివిధ శాఖల సేవలకూ శ్రీకారం

వివరాలు 7లో..

నేడు రాజయ్య ప్రమాణ స్వీకారం



హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 17 : స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రమాణ స్వీకారం ఉండనుంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యనేతలు హాజరుకానున్నారు.

మద్యం తాగి డబ్బుల కోసం వేధిస్తున్నాడని..

భర్తను హతమార్చిన భార్య

సహకరించిన కుటుంబ సభ్యులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్లో రాజు (ఫైల్)

దుగ్గొండి, ఫిబ్రవరి17 : మద్యం తాగడంతోపాటు తనకు డబ్బులు ఇవ్వాలని తరచూ వేధిస్తున్నాడన్న కోపంతో కుటుంబ సభ్యులతో కలిసి భర్తను హతమార్చింది. దుగ్గొండి మండలంలోని మైసంపల్లిలో శనివారం తెల్లవారుజామున ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మైసంపల్లికి చెందిన జేరుపోతుల రాజు(55)కు భార్య లక్ష్మి, కుమారులు ప్రశాంత్, సూర్య, కుమార్తెలు మాధవి, చింటు

తరువాయి 8వ పేజీలో..

కేయూలో పీహెచ్‌డీ అవకతవకలపై విచారణ

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారుల పరిశీలన
- వీసీ, డీన్లు, విభాగాధిపతులతో అంతర్గత సమావేశం
- 25కు పైగా లిఖిత పూర్వక విజ్ఞప్తులు
- ప్రతీ విషయాన్ని ఆలకించిన అధికారులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 17 : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విద్యార్థి సంఘాల ఆందోళనలు, దీక్షలు, పోలీసుల దాడులు, కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు సభ్యులుగా త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లపై లోతుగా పరిశీలన చేసింది. కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, సోషల్ సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, లా, ఇంజనీరింగ్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్‌తో పాటు ఇతర విభాగాల డీన్లతో వేర్వేరుగా అంతర్గతంగా సమావేశమయ్యారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల నోటిఫికేషన్ మొదలుకుని అడ్మిషన్ల ప్రక్రియనంత క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కమిటీ సభ్యులు ముగ్గురు సీరియస్‌గా అన్ని అంశాలను నోట్ చేసుకుని వాటికి సంబంధించిన పత్రాలను తీసుకున్నారు. ప్రతీ విషయాన్ని సంబంధిత డీన్లతో మాట్లాడి నోట్ చేసుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరుగలేదని అన్ని వర్సిటీ నియమనిబంధనల మేరకే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు డీన్లు, విభాగాధిపతులు త్రిసభ్య కమిటీ ముందుంచినట్లు సమాచారం.



వినతి పత్రం ఇస్తున్న కేయూ విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు

విద్యార్థులతో ముఖాముఖి

శనివారం మధ్యాహ్న భోజనం ముగిసిన తర్వాత త్రిసభ్య కమిటీ నేరుగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. విద్యార్థులు చెప్పిన ప్రతీ అంశాన్ని సావధానంగా విన్నారు. విద్యార్థులు చెప్పిన అంశాలన్ని లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో అందచేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ నేతలు కమిటీకి సమగ్రమైన అంశాలతో ప్రత్యేకంగా నివేదిక అందచేశారు.

త్రిసభ్య కమిటీకి ఇచ్చిన ఫిర్యాదులో వివరాలు ఇవే ..

పీహెచ్‌డీ కేటాగిరి-2 అడ్మిషన్ల నిబంధనలు కేయూ అకాడమిక్ స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందలేదని, ఆమోదం పొందకుండానే పీహెచ్‌డీ ఎంట్రెన్స్ నిర్వహించారని ఆక్షేపించారు. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో యూజీసీ నిబంధనలు బేఖాతరు చేశారని, పార్టుటైం అడ్మిషన్లు ఫుల్ టైం అడ్మిషన్లుగా డీన్లు మార్చారని ఆరోపించారు. కేటాగిరి-1లో అడ్మిషన్ల చేయగా మిగిలిన సీట్లను అదే ఏడాది కేటాగిరి-2లోకి మార్చాలని నిబంధనల ఉన్నప్పటికీ పాటించలేదని పేర్కొన్నారు. కేటాగిరి-1లో పీహెచ్‌డీ అడ్మిషన్లలో నచ్చిన అభ్యర్థులకు అక్రమంగా ఇంటర్వ్యూలు చేసి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 2022 ఫిబ్రవరి 3న డీన్ల కమిటీ రూపొందించిన మార్గదర్శకాలను స్టాడింగ్ కమిటీ ముందు పెట్టగా ఆయా పీహెచ్‌డీ మార్గదర్శకాలను ఆమోదించలేదని హైకోర్టులో రిజిస్ట్రార్ కౌంటర్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. యూజీసీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు అర్హత మార్కులను 45 శాతానికి తగ్గించినప్పటికీ వర్సిటీలో అమలు చేయలేదని పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు కొన్ని విభాగాల్లో 100 మార్కుల ప్రశ్నా పత్రంలో సమతుల్యత పాటించలేదన్నారు. డీఆర్‌సీతో జరుగాల్సిన పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి అడ్మిషన్లు చేపట్టారని దీంతో ఇంటర్వ్యూల్లో తమకు అనుకూలమైనవారికీ మార్కులు ఎక్కువగా వేసి నచ్చిన వారికి సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ ఇంటర్వ్యూ అడ్మిషన్ల కమిటీలో గందర గోళం నెలకుందని, నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. వర్సిటీ పీహెచ్‌డీ రికార్డులను టాంపరింగ్ చేశారని పేర్కొన్నారు. కొందరూ వర్సిటీలో పనిచేస్తూ అక్రమంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందారని ఆరోపించారు. ప్రత్యేకంగా లా, సివిల్ ఇంజనీరింగ్, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంగ్లీష్, బయోటెక్నాలజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో జరిగిన అవకతవకలను విన్నవించారు.

రెండు రోజుల్లో కమిటీ నివేదిక

శనివారం కేయూలో ఉన్నతాధికారులు, డీన్లు, విద్యార్థి సంఘాల నేతల నుంచి సమగ్రమైన సమాచారాన్ని సేకరించామని కేయూ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. మొత్తంగా 25 విజ్ఞప్తులు వచ్చాయని ప్రతీ అంశాలన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెల 19, 20 వరకు రిపోర్టును అందచేస్తామని కేయూ పీహెచ్‌డీ నిజ నిజనిర్ధారణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ తెలిపారు.

రవాణాశాఖలో అధికారుల బదిలీ

సంగెం, ఫిబ్రవరి 17: వరంగల్ రవాణాశాఖలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులు శనివారం బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ అధికారుల బదిలీల్లో భాగంగా వరంగల్‌లో పనిచేస్తున్న మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌రాథోడ్, కోల రవీందర్, శాలినీలు బదిలీ పొందారు. రమేష్‌రాథోడ్ హనుమకొండకు, రవీందర్ అదిలాబాద్, శాలినీ వాంకిడీ(ఆసిఫాబాద్ జిల్లా) బదిలీ కాగా రమేష్‌రాథోడ్ స్థానంలో హనుమకొండలో పనిచేస్తున్న శ్రీనివాస్ ఇక్కడికి వచ్చారు.

రేపటి 'ప్రజావాణి' రద్దు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: ప్రతీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల19న సోమవారం రోజు జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడారం సమ్మక్క- సారలమ్మ మహా జాతర విధుల్లో నిమగ్నమై ఉన్నందున పరిపాలనా పరమైన కారణాల వల్ల రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఫిర్యాదులు ఇవ్వడానికి కలెక్టర్ కార్యాలయానికి రాకూడదని కోరారు.

నీటి సంపులో పడి అన్నాచెల్లి మృతి

- అర్ధరాత్రి ఇంటిబయటకు వచ్చి.. చీకట్లో సంపు కనిపించక అందులో పడ్డ చిన్నారులు
- ఇద్దరు బిడ్డల్ని పోగొట్టుకుని తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు
- బాధిత కుటుంబానిది తాండూరు
- మేడారం జాతర కోసం వరంగల్‌లోని అత్తింటికి వచ్చిన కుటుంబం



శౌర్యతేజ (ఫైల్)



తేజస్విని (ఫైల్)

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 17: మేడారం మహా జాతరకు వెళ్లి సమ్మక్క,సారలమ్మలను దర్శించుకోవాలన్న ఆనందంలో తన కుమారుడు, కూతురితో అత్త వారింటికి వచ్చిన ఆ దంపతులకు తీరని గుండెకోత మిగిలింది. రాత్రి వరకు వచ్చీరాని మాటలతో తమ తో సరదాగా గడిపి.. పెద్దవాళ్లంతా నిద్రకు ఉపక్రమించిన క్రమంలో మూత్ర విసర్జన కోసమని బయటకు వచ్చిన ఆ అన్నాచెల్లెలు సంపులో పడి ప్రాణాలు పోగొ ట్టుకున్నారు. ఈ విషాద సంఘటన శుక్రవారం అర్ధరాత్రి వరంగల్‌లోని ఏను మాముల బాలాజీనగర్‌లో జరిగింది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు 30 ఏళ్లుగా మార్కెట్ సమీపంలో టీ షాపు నడుపుతూ కుటుం బాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు కాగా పెద్ద కూతురు బాలేశ్వరిని ఆరేళ్లక్రితం వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కరనం రవితేజకు ఇచ్చి వివాహం చేశారు. వారికి శౌర్య తేజ(3), తేజస్విని(ఏడాదిన్నర) సంతానం. రవితేజ పౌరహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. త్వరలో జరిగే మేడారం జాతరకు రావాలన్న యోచనలో శుక్రవారం సాయంత్రం రవితేజ తన కుటుంబంతో కలిసి వరంగల్ బాలాజీనగర్‌లోని అత్తవారింటికి వచ్చాడు. రాత్రి భోజనాలయ్యాక అందరూ నిద్రపోయారు. శౌర్యతేజ, తేజస్విని సెల్‌ఫోన్ చూసుకుంటూ ఉన్నారు. రాత్రి 11గంటల తర్వాత వారిద్దరూ మూత్ర విసర్జన కోసం ఇంటిబయట ఉన్న స్నానాలగదికి వెళ్లేందుకు బయటకు వచ్చారు. కానీ చీకటిగా ఉండటంతో ఇంటి ఆవరణలో మూతతీసి ఉన్న సంపులో పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత చిన్నారులు మంచంపై కనిపించకపోయేసరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు రవితేజ, బాలేశ్వరి, తాత శ్రీనివాస్, అమ్మమ్మ రమ బయటికి వచ్చి చుట్టుపక్కల వెతికారు. కానీ వారు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి సంపులో చూడగా శౌర్యతేజ, తేజస్విని నీటిలో కనిపించారు. వెంటనే వారిని బయటకు తీసి ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్, రమ దంపతుల మను వడు, మనవరాలు ఇద్దరు పిల్లలు సంపులో పడి చనిపోయారన్న వార్తతో బాలాజీనగర్‌లో విషాదం అలుముకుంది. ఇక ఒకేరోజు ఇద్దరు బిడ్డలను పోగొట్టుకున్న రవితేజ, బాలేశ్వరి దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వడమే కొంపముంచింది..

రాత్రి భోజనం తర్వాత తమ చిన్నారులకు సెల్‌ఫోన్ ఇవ్వడమే తమకు శాపమైందని తండ్రి రవితేజ గుండెలవిసేలా రోదిస్తున్నారు. 'మేం ప్రయాణం చేసి అలసి పోయి నిద్రపోయాం. పిల్లలిద్దరూ సెల్ ఫోన్ చూసి పడుకుంటారని అనుకున్నాం. కానీ అంతలోనే ఇంత దారుణం జరుగుతుందని ఊహించలేకపోయాం. అందరి తల్లిదండ్రులకు చేతులెత్తి మొక్కుతున్నాం. పిల్లలకు సెల్‌ఫోన్ చూడటం అలువాటు చేయవద్దు.. ప్లీజ్' అంటూ విలపించడం అక్కడి వారిని కంటతడిపెట్టించింది.

కాళేశ్వరం.. కంచికేనా?

5వ పేజీ తరువాయి

సమాచారం. మిగతా మోటర్లను మరమ్మతులకు నోచుకోకపోవటంతో అందులో ఎన్ని పనికి వస్తాయో అనేది తెలియటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో పంప్ హౌస్ వినియోగంలోకి రావాలంటే కనీసం రూ.1200కోట్లు అవసరంగా గతంలో ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ అవస్థల్లో ఉండగానే 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 20 పిల్లర్ కుంగిపోయింది. దీంతో పాటు 18, 19, 21, 22వ పిల్లర్లకు కూడా పగుళ్లు ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీని మరమ్మతుల కోసం సుమారు రూ.450కోట్లు అవసరంగా అధికారులు అంచనా వేశారు. అయితే బ్యారేజీ నిర్మాణంలోనే లోపాలు ఉన్నాయని, డిజైన్ లోపంతో బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై విజిలెన్స్ విచారణలో కూడా మేడిగడ్డ బ్యారేజీ పనికి రాద నే తేల్చి చెప్పింది. దీంతో బ్యారేజీ మొత్తం కూల్చి కట్టాలంటే మళ్లీ రూ.4,500 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీపై ప్రభుత్వం ఎటూ తేల్చలేక పోతోంది. మరోవైపు మరో కీలకమైన అన్నారం బ్యారేజీలోనూ లోపాలు వెలుగులోకి వచ్చాయి. 2023 అక్టోబరు 27న అన్నారం బ్యారేజీలో పలు పిల్లర్ల వద్ద సీపేజ్‌లు కనిపించాయి. దీంతో బ్యారేజీలో నీళ్ల లీకేజీతో పెద్ద పెద్ద బుడుగలు రావటంతో అధికారులు అప్పటికప్పుడు సిమెంట్ బ్యాగుల్లో ఇసుక నింపి సీపేజ్‌లను రాకుండా కట్టడి చేశారు. ఇది కూడా మేడిగడ్డ బ్యారేజీ టెక్నాలజీతోనే నిర్మించారు. ఇటీవల మరోసారి బ్యారేజీలో బుంగలు ఏర్పడంతో ఇంజనీర్లలో ఆందోళన వ్యక్తం అయింది. భూపాలపల్లి జిల్లాలో ఉన్న కీలకమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు కన్నెపల్లి పంపుహౌస్‌లు ప్రమాదంలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరంపై ప్రభుత్వం వెనుకడుగు..

కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును మొదటి నుంచి వ్యతిరేకిస్తుంది. ప్రాణహిత-చెవేళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టడం గత ప్రభుత్వం చేసిన తప్పుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొంటున్నారు. శనివారం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయటం అసాధ్యమని, కనీసం అక్కడ కాఫర్ డ్యామ్ కూడా నిర్మించే పరిస్థితి లేదని మంత్రి ఉత్తమ్ తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం రూ.38 వేల కోట్లతో ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టు పూర్తయ్యేదని, రూ.1.47లక్షల కోట్లకు అంచనాలను పెంచి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీంతో భారీగా అక్రమాలు జరిగినట్లుగా ప్రభుత్వం పేర్కొంటుంది. దీంతో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థలే భరించేందుకు ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వెనుకడుగు వేస్తుందనే చర్చ జరుగుతోంది. అన్నారం బ్యారేజీలో లీకేజీలు కూడా భవిష్యత్తులో బ్యారేజీకి ప్రమాదాన్ని తెచ్చి పెడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో మరో రూ.25వేల కోట్లు వెచ్చిస్తే చెవేళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంతో పాటు 18లక్షల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టును వినియోగంలోకి తేవటం ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం చెవేళ్ల-ప్రాణహిత వైపే మొగ్గు చూపితే ఇప్పటికే నిర్మాణమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగానే మిగిలి పోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ ఛైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ ఛైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష ● వివిధ శాఖల సేవలకూ శ్రీకారం



ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 17 : మేడారం తరలొచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అదించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క వైద్యఅధికారులకు ఆదేశించారు. శనివారం మేడారం పర్యటనలో భాగంగా ఆమె హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా, మహాజాతర నోడల్ అధికారి, హెల్త్ డైరెక్టర్ ఆర్.వి కర్ణన్, ఐటీడీఏ పీవో అంకిత్‌లతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. మేడారం మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తు మాట్లాడుతూ జాతరలో ముఖ్యంగా వ్యాపారులు భక్తులకు విక్రయించే ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు భక్తులకు తెలిసే విధంగా సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని, గద్దెల ప్రాంగణంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ 40జీవీకే అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉండేప్రాంతాలలో నిరంతరం వైద్య సిబ్బంది ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంపన్నవాగు ప్రాంతంలో గజ ఈతగాళ్లను మోహరించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్యూలైన్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి అప్పయ్యసామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జగదీశ్, ఏటూర్‌నాగారం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సురేష్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బైక్ అంబులెన్సు సేవలు ప్రారంభం

మహాజాతరలో భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వీలుగా బైక్‌అంబులెన్స్‌లను మంత్రి సీతక్క, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తు, హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు. మేడారం భక్తులకు అత్యవసర వైద్యం కోసం 40బైక్ అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, ఈబైక్ అంబులెన్సుల ద్వారా 21 వైద్య సేవలను అందించే వీలుందన్నారు.

మేడారం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మల జాతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నా రు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ఉన్నచోట అదనపు ప్లాస్టిక్ బకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి కొరత లేకుండాచూడాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో మరుగుదొడ్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నా రు. నిరంతరం విద్యుత్ అందిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ములుగు కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శభరీష్ అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులున్నారు.

మీడియాతో ఆత్మీయ సమ్మేళనం

మహాజాతర విజయవంతానికి సన్నద్ధం చేస్తున్న అధికారులు మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె తొలుత సమాచారపౌరసంబంధాల శాఖ రూపొందించిన మేడారం పుస్తకాన్ని, మీడియా టీషర్టులను కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శభరీష్‌తో కలిసి ఆవిష్కరించారు. జాతర విజయవంతం చేయడంలో మీడియాకీలకపాత్ర పోషించాలని, సమ్మక్క సారలమ్మ మహా జాతరకీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలాల తెలిసే వార్తలు ప్రసారం చేయాలని కోరారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వసతులు, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి జాతరకొచ్చే భక్తుల కోసం రూట్‌మ్యాప్ వీడియోను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, ఏటూరునాగారం అదనపు ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, సమాచార శాఖ అదనపు డైరెక్టర్‌లక్ష్మణ్, జిల్లా పౌరసంబంధాల అధికారి రఫీక్, ఏపీఆర్వో వేణు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6వేల ప్రత్యేక బస్సులు

అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేకంగా 6వేల బస్సులను నడపడానికి సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలో తాత్కలిక ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ 55ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా టికెట్ కౌంటర్‌లు, విశ్రాంతి గదులు, సిబ్బంది వసతి ఏర్పాట్లు చేశామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా జాతరకు వచ్చే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు ఈసారి అధికంగా వచ్చే అంచనాలు ఉన్నందున గతంలో కంటే ఎక్కువగా 6వేల బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, అదనపు ఎస్పీ సంకీర్త్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత, ప్రత్యేకాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్ల ప్రసాదం

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా అమ్మవార్ల జాతరకు వెళ్లలేని భక్తులు తమ కానుకలను, మొ క్కులను ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్లకు చెల్లిస్తే, ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల ఇం టికే ప్రసాదం అందించే ఏర్పాట్లు అధికారులు చేశారు. ఈనెల 21 నుంచి 25 వరకు దేవాదాయ శాఖతో ఆర్టీసీ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రతీ బస్సుస్టేషన్ ప్రాంతంలో కార్గో కొరియర్ సేవలందించే కార్యాలయం వద్ద రూ. 300 అమ్మవార్లకు చెల్లిస్తే, భక్తుల ఇంటికి ప్రసాదాలు పసుపు, కుంకుమలు అందజేస్తారు. వివరాలకు 040-69440069 / 69440000 / 23450033 లకు సంప్రదించాలని కోరారు.

మేడారంలో చోరీ - రూ.11.42 లక్షల అపహరణ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : మేడారంలో దొంగలు సంచరిస్తున్నారని, జంపన్నవాగు, తల్లుల గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట మార్గంలో ఇప్పటికే 16 చోరీలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఓ కొబ్బరికాయలు, బెల్లం వ్యాపారం నిర్వహించే షాపులో శుక్రవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాత్రి సమయంలో నిర్వాహకులు షాపు మూసి వెళ్లిన తర్వాత షాపులోకి చొరబడ్డారు. షాపులో ఉన్న రూ. 11.42 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జంపన్నవాగు ప్రాంతంలో ఒక మహిళ మెడలో నుంచి 30 గ్రాముల పుస్తెల తాడు చోరీకి గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



అదనపు కలెక్టర్‌గా సంధ్యారాణి బాధ్యతలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: కలెక్టర్ సూచనలతో అధికారుల సమన్వయంతో సమర్థవంతమైన సేవలు అందిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యారాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో వాసుచంద్ర, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌లు అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ గతంలో రెవెన్యూ పరమైన అంశాలపై, ఎన్నికల విధులపై జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ అధికారులతో సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సంధ్యారాణి

వైభవంగా శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీగోదా అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

మట్టెవాడ, ఫిబ్రవరి 17: శ్రీబాలనగర శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం విష్ణు సహస్రనామ స్తోత్రం, సాయంత్రం గోదా అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం(సారె) సమర్పించారు. అనంతరం స్వామివారిని నగర పుర వీధుల గుండా మేళతాళాలు కోలాటాలతో భక్తులు రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, సభ్యులు గందె గోవిందరాజులు, వేణుగోపాలస్వామి ఆలయ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు



గ్రామాన్ని సందర్శించిన టాటా ఇనిస్ట్యూట్ విద్యార్థులు

గీసుగొండ, ఫిబ్రవరి 17: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లికి టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ ఎంఏలో చదువుతున్న విద్యార్థులు 31 మంది సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, స్థానిక ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంపై జిల్లా ట్రేయినింగ్ మేనేజరు కూసం రాజమౌళి విద్యార్థి బృందానికి వివరించారు. గ్రామానికి రూ.11.48 లక్షల నగదు పారితోషకం లభించినట్లు వివరించారు.



సంగెంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చింతల్ బ్రిడ్జి కింద కేక్ కట్ చేస్తున్న మసూద్



క్రిస్టియన్‌కాలనీలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

కేక్‌లు కట్‌చేసి, పండ్ల పంపిణీ చేసినా బీఆర్ఎస్ శ్రేణులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 17: నగరవ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఖిలావరంగల్, క్రిస్టియన్ కాలనీ, శివనగర్, ఖిలావరంగల్ తూర్పుకోటలలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కేసీఆర్ జన్మదిన కేక్ కట్ చేసి, పండ్లను పంపిణీ చేశారు. ఖిలావరంగల్‌లోని అమరవీరుల స్థూపానికి పూలమాల వేశారు. నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో చావుఅంచులకు వెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన యోధుడు కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, వస్కుల బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పగడాల సతీష్, సంగరబోయిన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● కరీమాబాద్: కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఉర్సు ఆర్య సమాజ్‌మందిరంలో పూజారి మంత్రి గుడిమల్ల వేదప్రకాష్ మంత్రోచ్ఛరణల మధ్య దేవయాగం నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, జిల్లా నాయకులు వొగిలిశెట్టి అనిల్, మరుపల్ల గౌతమ్, గజ్జి సాంబయ్య, రాజన్‌బాబు, సురేష్, శెట్ట మోహన్, సంజీవ్, ఆవునూరి సునీత, మంజుల పాల్గొన్నారు. కార్పొరేటర్ పల్లం పద్మా రవి, డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్ ఆధ్వర్యంలో ఏసీబీఐ బ్యాంక్ ప్రధాన కూడలిలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో మంద శ్యామ్, కుమార్, రాజు, సూరి, భిక్షపతి, హరి, దస్తగీర్, మహేష్, శివ, సుమేర్, వేణు, సాగర్, రమేష్, సాయిసింగ్, విన్నూ, మహిళా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

● సంగెం: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు నరహరిలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఫోరం మాజీ అధ్యక్షుడు గుండేటిబాబు, వైస్ ఎంపీపీ మల్లయ్య, ఎంపీటీసీలు నర్సింహస్వామి, మల్లయ్య, కట్ల సుమలత, రాణి పాల్గొన్నారు.

● శంభునిపేట: కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి రంగశాయిపేట జంక్షన్‌లో కేసీఆర్ జన్మదిన కేక్‌కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంతం తారా మోహన్, డివిజన్ అధ్యక్షుడు కర్ర కుమార్, శెంకేశి లింగమూర్తి, మండల సురేష్, లక్ష్మయ్య, పాల రంజిత్, నిమ్మల సదానందం యాదవ్, కలకోట్ల రమేష్, ఈదుల బిక్షపతి, ఆవునూరి లక్ష్మీ, శెంకేశి రాధిక, అడుప కవిత పాల్గొన్నారు.

● గిర్మాజిపే : వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ ఎం.రాజు, బీఆర్ఎస్ నాయకుడు చింతాకుల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఏకశిలానగర్ : నగరంలోని 32, 33 డివిజన్‌లలో కార్పొరేటర్‌లు పల్లం పద్మారవి, ముష్కమల్ల సుదాకర్, పొగాకు సందీప్, గోగికార్ రవీందర్ ఆధ్వర్యాల్లో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు.

● పోచమ్మమైదాన్: ఆరెపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నేరెళ్ల రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ, మాజీ కార్పొరేటర్ వీర భిక్షపతి, ఎల్లావుల కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. గోపాలస్వామిగుడి చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యెలుగం సత్యనారాయణ, నీలం రాజ్‌కిషోర్, యెలుగం రవిరాజ్, కొత్తపెల్లి వినయ్ పాల్గొన్నారు. పోచమ్మమైదాన్ చౌరస్తాలో 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నగేష్, యాకూబ్, విజయ్‌రావ్, దయాకర్, ఏజాస్, క్రాంతి, రాజు, బాబు, సురేష్ పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ: చింతల్‌లో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు యాకయ్య, నాయకులు గడల రమేష్ పాల్గొన్నారు.

● వరంగల్‌టౌన్: ఏనుమాముల బాలాజీనగర్‌లో డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఖాజీపేట దర్గా ఫాక్స్ మాజీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ముడుసు నర్సింహ, కేతిరి రాజశేఖర్, గంధ్రాతి భాస్కర్,జంగం రాజు పాల్గొన్నారు. సొసైటీకాలనీ మదర్‌థెరిసా అనాథాశ్రమంలో కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ వేడుకలను నిర్వహించారు.

ప్రణాళికతో చదవండి: డీఈవో

గిర్మాజిపేట, ఫిబ్రవరి 17: వచ్చే నెల 18 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి వార్షిక పరీక్షలను విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో, ప్రణాళిక బద్ధంగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి విద్యార్థులకు సూచించారు. శనివారం శ్రీకృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల నెలవారి సమావేశంలో డీఈవో మాట్లాడుతూ పాఠశాల విద్యను దాటి తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్య,ఉద్యోగం, జీవితంలో అత్యున్నత స్థాయిలో రాణించేందుకు 10వ తరగతి పునాదియనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, భూపాల్, అఫ్సర్, భవాణి, కరుణ, రమేష్, ఉమేష్, రవికుమార్, సీఆర్‌పి ప్రణీత పాల్గొన్నారు.

● ఏకశిలానగర్: పరీక్షలపై టెన్త్ విద్యార్థులు ఆందోళనతో ఒత్తిడి పెంచుకోవద్దని, ప్రశాంతంగా చదవాలని డీఈవో వాసంతి సూచించారు. కరీమాబాద్‌లో వడుప్సా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్ఫూర్తి-2024 ఓరింటేషన్ ప్రోగ్రాంకు డీఈఓ వాసంతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదిలో పది జీపీఏ సాధించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు వడుప్సా ఇలాంటి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. వడుప్సా జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్ మాట్లాడుతూ పదిలో అత్యద్భుత ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. జిల్లాలోని 70 వడుప్సా పాఠశాలల నుంచి దాదాపు 1500 మంది విద్యార్థులు హాజరవ్వగా పరీక్షల కిట్‌లను అందించారు. కార్యక్రమంలో వడుప్సా (ట్రస్మా) జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్ల రవి, కోశాధికారి రాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ముఖ్య సలహాదారు ఎస్.వెంకటేశ్వర్‌రావు, కోడె శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, ఆడెపు వెంకటేశ్వర్లు, ఏ సతీష్ కుమార్, మడిపల్లి రాజు, ఎస్ కిరణ్ కుమార్, ముక్కెర రవీందర్, దాసి సతీష్ మూర్తి, కూరపాటి మోహన్, కూచన క్రాంతి కుమార్, సంగ వెకట్రాజం, కొడిమెల రవి, నందాల చందర్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

వరంగల్ నుంచి మేడారానికి 430 ప్రత్యేక బస్సులు

నేటి నుంచి ప్రారంభం : డీఎం ధరమ్‌సింగ్

గిర్మాజిపేట, ఫిబ్రవరి 17: ఈనెల 21 నుంచి జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వరంగల్ తాత్కాలిక బస్‌స్టేషన్ నుంచి 430 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరమ్ సింగ్ తెలిపారు. ఆదివారం నుంచి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని, అయితే తమ వెంట తప్పనిసరిగి తెలంగాణ స్థానికత ఆధార్‌కార్డు ఒరిజినల్‌ది తెచ్చుకోవాలని తెలిపారు. శనివారం నాడాయన వరంగల్ తాత్కాలిక బస్‌షెల్టర్ వద్ద విలేఖరులతో మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లు, తాగునీరు వసతి, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు 2 లక్షల మంది భక్తులను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వరంగల్ నుంచి రూ.250, 11 సంవత్సరాలలోపు బాలురకు రూ.140 టికెట్ ధరలున్నట్లు తెలిపారు. భక్తులు తిరుగు ప్రయాణంలో ములుగురోడ్డు పాయింట్ వద్ద దిగిన తరువాత అక్కడి నుంచి వరంగల్, కాజిపేట రైల్వేస్టేషన్‌లు, హనుమకొండ బస్‌స్టేషన్‌లకు వెళ్లేందుకు ఉచిత సిటీ బస్సులను నడుపుతామని తెలిపారు.



ధరమ్‌సింగ్

పథకాలపై అవగాహన పెంచుకోవాలి

మామునూరు, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పథకాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్‌నాయుడు చెప్పారు. శనివారం మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు పీవీ నర్సింహరావు పశు వైద్య విశ్వవిద్యాలయంలో జాతీయ మత్స్యశాఖఅభివృద్ధి మండలి ఆధ్వర్యంలో తెల్ల చేపల పెంపకంలో మెరుగైన యాజమాన్య పద్ధతులపై ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లబ్ధిదారులు చేపల పెంపకంతో ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో అధికారులు డాక్టర్ రాజన్న, డాక్టర్ గణేష్, డాక్టర్ రాజు, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.



పత్రాలను అందిస్తున్న అధికారులు

నాలుగు ఉద్యోగాలు పొందిన యువకుడు

నెక్కొండ, ఫిబ్రవరి 17 : వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సూరుపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గడ్డం రంజిత్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను పొందాడు. చిన్ననాటి నుంచి సరస్వతీ పుత్రుడుగా విద్యలో రాణిస్తూ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను పొంది మండలంలోని సూరుపల్లి గ్రామానికి ఆదర్శంగా నిలిచి తల్లిదండ్రుల కళలను సాకారం చేశాడు. గ్రామంలోని గీత కార్మికుడు గడ్డం వేణుగోపాల్-అరుణ దంపతుల పెద్ద కుమారుడు అయిన రంజిత్ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి వరకు చదివాడు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెంలో డిప్లొమా, హైదరాబాద్‌లో బీ.టెక్.(సీవిల్) 2019లో పూర్తి చేశాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రంజిత్ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఇంట్లో పోటీ పరీక్షలకు ప్రీపేర్ అవుతూ పలు పరీక్షలు హాజరయ్యాడు.

గత సంవత్సరం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోసం, రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో ఉద్యోగం కోసం పరీక్షలు రాయగా రైల్వేలో అసిస్టెంట్ బీజేసీ లెవల్-1లో ఉద్యోగం పొందాడు. అనంతరం వచ్చిన ఫలితాల్లో కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయినప్పటికీ, రైల్వేలో ఉద్యోగం చేస్తుండగా గత పది రోజుల క్రితం వచ్చిన ఫలితాల్లో గ్రూప్-4లో ఉద్యోగానికి అర్హత పొందాడు. ఈనెల 17న విడుదలైన ఫలితాల్లో ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్‌లో ఉద్యోగానికి రంజిత్ సెలక్ట్ అయ్యాడు. తాను చదివిన చదువుకు టౌన్‌ప్లానింగ్ విధులకు సంబంధం ఉండటంతో టౌన్ ప్లానింగ్‌లో ఉద్యోగానికి వెలుతున్నట్లు చెప్పాడు.

రంజిత్ తండ్రి గీత కార్మికుడిగా, తల్లి వ్యవసాయ కూలీగా కష్టాలు పడుతూ చదివించారని, తల్లిదండ్రుల కష్టాలకు రంజిత్ శ్రమ తోడయిందంటూ గ్రామ మాజీ సర్పంచ్ సింగారపు గీతాభాస్కర్, గ్రామస్థులు రంజిత్‌ను అభినందించారు. గ్రామ ప్రజలు రంజిత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



గడ్డం రంజిత్

విద్యార్థి జీవితానికి ఇంటర్ విద్య మలుపురాయి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవరావు

శంభునిపేట, ఫిబ్రవరి 17 : ఇంటర్మీడియట్ దశ విద్యార్థి జీవితానికి మలుపురాయి అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవరావు అన్నారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించా రు. ప్రిన్సిపాల్ కె.శోభాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఐఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇం టర్‌లో ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రిన్సిపాల్ శోభాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయ సాధన కొరకు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రజిత, మ హాలక్ష్మీ, రూపారాణి, వీరాంజనేయ కుమార్, మల్లారెడ్డి, సు .దాకర్, అనిల్, నరేష్, లక్ష్మీ, మమత, అనిత పాల్గొన్నారు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన

గీసుగొండ, ఫిబ్రవరి 17: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల లప్‌లోడ్‌పై ఆయా పాఠశాలల్లో తనిఖీ బృందాలు శనివారం పరిశీలించాయి. ఈ సందర్భంగా వంచనగిరి మోడల్‌స్కూల్, కేజీబీవీలలో గెజిటెడ్ హెడ్మాస్టర్‌లు పట్టాభి, బాలకుమార్‌లు విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లను, ఎఫ్ఎస్‌లను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఎస్‌వో హిమబిందు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థులు ప్రాజెక్టు వర్క్ నోట్‌బుక్‌లను పరిశీలిస్తున్న బాలకుమార్

మహాజాతరకు హుండీలు సిద్ధం

మేడారం, ఫిబ్రవరి 17 : మహాజాతరలో భక్తులు సమర్పించే కానుకల కోసం దేవాదాయ శాఖ అధికారులు మేడారంలో హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. 452 ఇనుప, 100 క్లాత్ హుండీలను సిద్ధం చేయగా.. సమ్మక్క పేరుతో 200, సారలమ్మ పేరుతో 200, పగిడిద్దరాజు పేరుతో 26, గోవిందరాజు పేరుతో 26 హుండీలను సిద్ధం చేశామని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనీల్ తెలిపారు. ఇవేకాకుండా మరో 60 హుండీలు మరమ్మతులో ఉన్నాయన్నారు. వీటితోపాటు వంద క్లాత్ హుండీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటన్నిటికి తాళాలు వేసి సీల్ చేసి.. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, మేడారం ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సంతకాలతో ఉన్న పేపరు అంటించారు.

మహిళ ఆత్మహత్య

కరీమాబాద్, ఫిబ్రవరి17: శంభునిపేట విశ్వనాథ్‌కాలనీలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సిద్దిపేటకు చెందిన శివరాత్రి జ్యోతి(27), రంగశాయిపేట ప్రాంతానికి చెందిన శివరాత్రి రజినీకాంత్‌లు ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. రజినీకాంత్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం మధ్యాహ్నం అందరూ ఇంట్లోనే నిద్రించారు. సాయంత్రం పెద్ద కూతురు నిద్రలేచి చూడగా, తల్లి ఉరి వేసుకోని కనిపించడంతో వెంటనే తండ్రి రజినీకాంత్‌ను నిద్రలేపింది. వీరు విశ్వనాథ్‌కాలనీ-3లో రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నారు. సమాచారం తెలుసుకున్న మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసి, మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించి మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మహిళ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని ఎస్సై వెంకన్న తెలిపారు.



శివరాత్రి జ్యోతి (ఫైల్)

భర్తను హతమార్చిన భార్య

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. రాజు కుటుంబం వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. తాగుడుకు బానిసైన రాజు డబ్బుల కోసం భార్యని తరచూ వేధిస్తున్నాడు. శుక్రవారం సమ్మక్క దేవుడికి కొలుపు చేసుకోవడంతో ఆ కార్యక్రమానికి కుటుంబసభ్యులంతా హాజరయ్యారు. రోజులాగే శుక్రవారం అర్ధరాత్రి డబ్బుల కోసం భార్యతో రాజు గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య లక్ష్మీ, కుమారుడు సూర్య, కుమార్తె మాధవి, అల్లుడు రాకేశ్, బంధువు తరుణ్ కలిసి రాజును రాళ్లతో కొట్టి ఉరి తీసి చంపారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరమేశ్ శనివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదుతో ఆ ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

త్వరలో జూ పార్కుకు పెద్దపులి, అడవి దున్న

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: వరంగల్ నగరంలోని కాకతీయ జూ పార్కుకు త్వరలో పెద్దపులి, అడవి దున్నను సందర్శకులకు ప్రదర్శనగా ఉంచాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏప్రిల్ 1 నుంచి జూ పార్కులో పెద్దపులితోపాటు అడవి దున్న, మరో రెండు రకాల జింకలను సందర్శకులకు అందుబాటులో ఉంచుతామని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ పర్గేయిన్ తెలిపారు. ప్రస్తుతం జూ పార్కులో ఉన్న సౌకర్యాలు అదనపు ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. జూ పార్కులో కొత్తగా ఏర్పాటు చేసిన పక్షుల కేంద్రాన్ని బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించారు. గూడూరు అటవీ డివిజన్ ప్రాంతంలో పులిమడుగు వద్ద ఏకో టూరిజం క్యాంపింగ్‌ను పర్గే ఇన్ ప్రారంభించారు. పాకాల అభయారణ్యం అభివృద్ధి సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ భీమా నాయక్, వరంగల్ డీఎఫ్‌వో భూక్యా లావణ్య, గూడూరు, మహబూబాబాద్ డివిజన్ అటవీ అధికారులు చంద్రశేఖర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.



పక్షుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు



అమ్మవారిని దర్శించుకుంటున్న వేణుగోపాల్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: శ్రీభద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కారా వేణుగోపాల్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు, సీఎం రేవంత్ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ జగన్మోహన్‌రావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఈవీవీ శ్రీనివాసరావు, జి.నాగభూషణం, కె.ప్రవీణ్, ప్రసాదరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పేదల పక్షపాతి

సంగెం, ఫిబ్రవరి 17: పేద కుటుంబాల అభివృద్ధికి పాటుపడుతూ, ప్రధాని మోదీ ప్రభుత్వం పేదల ప్రభుత్వంగా పేరుపొందిందని బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.జయంత్‌లాల్ అన్నారు. శనివారం తీగరాజుపల్లి, సోమ్లతండాల్లో గావ్‌చలో అనే కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులతో పర్యటించి గ్రామస్థులతో ముచ్చటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు అండగా ఉంటూ పలు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం, పీఎం కిసాన్ పథకం కింద ఆరువేలు, ముద్ర రుణాలను అందిస్తు ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగరాజు కృష్ణ, కిరణ్, ప్రభాకర్, రామస్వామి, మామిండ్ల రమేష్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

శంభునిపేట, ఫిబ్రవరి 17 : అర్హులైన ప్రతీ కుటుంబం గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ డీఈ శెంకేశి మల్లికార్జున్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా అర్హుల నుంచి వివరాల నమోదు ప్రక్రియను శనివారం రామాలయం, గాంధీ జంక్షన్ పలు ప్రాంతాల్లో మల్లికార్జున్ ప్రారంభించి మాట్లాడారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం : సీపీ

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 17: ప్రజా శ్రేయస్సు కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. దేశాయిపేటలో శనివారం ఓ ప్రైవేటు స్కూల్‌లో మన అమెరికా తెలుగు సంఘం (మాటా) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, వైద్య శిబిరం నిర్వహించారు. సీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాటా అధ్యక్షుడు గానగోని శ్రీనివాస్, మాటా ఇండియా కోఆర్డినేటర్ విజయభాస్కర్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్‌కుమార్, డాక్టర్ ధనుంజయ్, దినేష్ చంద్ర, మాదాసి ప్రణయ్, ప్రహర్ష, సదానందం, బన్ను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

రేషన్ ఈకేవైసీ చేయించుకోవాలి

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 17: జిల్లాలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు సత్వరమే ఈకేవైసీ చేయించుకోవ్వాందిగా జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 29తో రేషన్ కార్డుల ఈకేవైసీ ముగుస్తున్నందున జిల్లాలోని ప్రతీ కార్డుదారుతో పాటు వారి కుటుంబ సభ్యుల వేలిముద్రలను సంబంధిత రేషన్ డీలర్ వద్దకు వెళ్లి నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. అలాగే ఈ నెల రేషన్ బియ్యం పంపిణీని మరో రెండు రోజుల పాటు పొడిగిస్తున్నామని ఈ నెల 18 వరకు రేషన్ డీలర్లందరూ బియ్యాన్ని పంపిణీ చేయాలని సూచించారు.

'ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచిన సీపీవో'

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: విధి నిర్వహణలో కిందిస్థాయి ఉద్యోగులకు ఆదర్శంగా ఉంటూ తనదైన శైలిలో సీపీవో జీవరత్నం గుర్తింపు తెచ్చుకున్నారని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ అన్నారు. శనివారం జిల్లా ప్లానింగ్ అధికారి కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న జీవరత్నంను టీఎన్జీవోస్ నాయకులు సన్మానించారు. అలాగే జిల్లా సీపీవోగా వచ్చిన గోవిందరాజుకు స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, గద్దల రాజు, ఉషా, రమేష్‌చంద్ర, సుభాష్, ప్రభాకర్, వెంకట్రావ్, దుర్గారాజు, సతీష్, శ్రీదేవి, వెంకన్న, సుగుణ, రవళి, అనిల్ పాల్గొన్నారు.

ఎంపీ రవిచంద్రను కలిసిన నిమ్మగడ్డ

సంగెం, ఫిబ్రవరి 17: రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ వేసిన వద్దిరాజు రవిచంద్రను వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వేంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని రవిచంద్ర స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 18 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: కలెక్టర్ సూచనలతో అధికారుల సమన్వయంతో సమర్థవంతమైన సేవలు అందిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యారాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో వాసుచంద్ర, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌లు అదనపు కలెక్టర్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ గతంలో రెవెన్యూ పరమైన అంశాలపై, ఎన్నికల విధులపై జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తూ అధికారులతో సమర్థవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సంధ్యారాణి

నాలుగు ఉద్యోగాలు పొందిన యువకుడు



గడ్డం రంజిత్

నెక్కొండ, ఫిబ్రవరి 17 : వరంగల్ జిల్లా నెక్కొండ మండలం సూరుపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు గడ్డం రంజిత్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను పొందాడు. చిన్ననాటి నుంచి సరస్వతీ పుత్రుడుగా విద్యలో రాణిస్తూ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను పొంది మండలంలోని సూరుపల్లి గ్రామానికి ఆదర్శంగా నిలిచి తల్లిదండ్రుల కళలను సాకారం చేశాడు. గ్రామంలోని గీత కార్మికుడు గడ్డం వేణుగోపాల్-అరుణ దంపతుల పెద్ద కుమారుడు అయిన రంజిత్ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి వరకు చదివాడు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెంలో డిప్లొమా, హైదరాబాద్‌లో బీ.టెక్.(సివిల్) 2019లో పూర్తి చేశాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రంజిత్ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఇంట్లో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ పలు పరీక్షలు హాజరయ్యాడు. గత సంవత్సరం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోసం, రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో ఉద్యోగం కోసం పరీక్షలు రాయగా రైల్వేలో అసిస్టెంట్ టీజేసీ లెవల్-1లో ఉద్యోగం పొందాడు. అనంతరం వచ్చిన ఫలితాల్లో కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయినప్పటికి, రైల్వేలో ఉద్యోగం చేస్తుండగా గత పది రోజుల క్రితం వచ్చిన ఫలితాల్లో గ్రూప్-4లో ఉద్యోగానికి అర్హత పొందాడు. ఈ నెల 17 న విడుదలైన ఫలితాల్లో ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్‌లో ఉద్యోగానికి రంజిత్ సెలక్ట్ అయ్యాడు. తాను చదివిన చదువుకు టౌన్‌ప్లానింగ్ విధులకు సంబంధం ఉండటంతో టౌన్ ప్లానింగ్‌లో ఉద్యోగానికి వెలుతున్నట్లు చెప్పాడు . రంజిత్ తండ్రి గీత కార్మికుడిగా, తల్లి వ్యవసాయ కూలీగా కష్టాలు పడుతూ చదివించారని, తల్లిదండ్రుల కష్టాలకు రంజిత్ శ్రమ తోడయిందంటూ గ్రామ మాజీ సర్పంచ్ సింగారపు గీత్యాభాస్కర్, గ్రామస్థులు రంజిత్‌ను అభినందించారు. గ్రామ ప్రజలు రంజిత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఆస్ట్రానమీ ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సుతారి సురేష్

ఖానాపురం, ఫిబ్రవరి 17 : మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు సుతారి సురేష్ మైసూర్ ఆస్ట్రానమీ ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైనట్లు శనివారం తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ ఓమి బాబ సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్, స్వామి వివేకానంద యూత్ మూమెంట్ కలిసి నిర్వహిస్తున్న ఆస్ట్రానమీ ఒలింపియాడ్ ఎక్స్‌జర్ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈ క్యాంపులో ఖగోళ శాస్త్రంపై జరిగే పరిశోధనలపై అధ్యయనం చేయడం జరుగుతుందన్నారు. ఖగోళంలో పరిణామాలు, గ్రహాల ఏర్పాటు వంటి అంశాలు టెలిస్కోప్‌తో ఏ విధంగా పరిశోధించాలి, ఏ విధంగా చూడాలి అనే అంశాలపై పరిశోధనలు జరపడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ అంశంపై ఈ నెల 19 నుంచి 22వ తేది వరకు మైసూర్ ఇండియన్ ఇన్స్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సురేష్‌ను అభినందించారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 17 : తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్ పరీక్షలో ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కల్లెపు సాత్విక్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం జయ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి బాలాజీరావు. చిదురాల మాధవి. సుందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

నల్లబెల్లి, ఫిబ్రవరి 17: ఇటీవల మండలంలోని అర్వయ్యపల్లి పల్లె ప్రకృతి వనాన్ని ఓ గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేశారని అర్వయ్యపల్లి పంచాయతీ కార్యదర్శి అఖిల స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసుల విచారణ మేరకు మండలంలోని బిల్ నాయక్ తండాకు చెందిన మాలోతు నమ్యా జేసీబీ సాయంతో పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేశారని తెలిందని పోలీసులు తెలిపారు. రూ.80 వేల మేరకు ప్రభుత్వ ఆస్తిని నష్టం చేసినందుకు గాను నమ్యాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

ఎంపీడీవోను కలిసిన ప్రజాప్రతినిధులు

పర్వతగిరి, ఫిబ్రవరి 17: నూతనంగా ఎంపీడీవోగా మండలానికి బదిలీపై వచ్చిన మాలోత్ శంకర్‌ను శనివారం మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ లూనావత్ కమలపంతులు, వైస్‌ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సర్వర్, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు మాడుగుల రాజు, కోల మల్లయ్య, కరామిళ్ల మోహన్‌రావు, సూర రమేష్, మాలోత్ కాంతమ్మ, భూక్యా బాస్కర్, మండల కోఆప్షన్ మెంబర్ షేక్‌షబ్బీర్, నాయకులు రంగు కుమార్, పట్టాపురం ఏకాంతంగౌడ్, రంగు జనార్ధన్, మాలోత్ లాలు, బాల్లె వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి, ఫిబ్రవరి 17: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వాహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవిలో నీటి ఎద్దడి రాకుండా మంచినీటి పైపులైన్లు రిపేరు చేయించాలని అన్నారు. నర్సరీలలో షేడ్‌నెట్లు ఏర్పాటుచేయాలని, అన్ని బ్యాగులలో విత్తనాలు పెట్టాలని అన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి సుమారు 100 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో సుశీల్‌కుమార్, ఎంపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యున్ని కలిసిన అనీల్‌రావు



పర్వతగిరి, ఫిబ్రవరి 17: రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన అనీల్‌కుమార్ యాదవ్‌ను శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైనందుకు గాను ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

యువకుడికి సెల్‌ఫోన్ అప్పగింత

రాయపర్తి, ఫిబ్రవరి 17 : రాయపర్తి మండల కేంద్రానికి చెందిన ఐత లక్ష్మణ్ ఏడు నెలల క్రితం తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా, సీఈఐఆర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేసి బాధితుడికి శనివారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా రాయపర్తి ఎస్‌ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ బాధితులు తమ సమస్యలను చెప్పుకోవడానికి నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు రావాలన్నారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే మీ సేవా ద్వారా అప్లై చేసుకుని సీఈఐఆర్ యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

మహాజాతరకు హుండీలు సిద్ధం

మేడారం, ఫిబ్రవరి 17 : మహాజాతరలో భక్తులు సమర్పించే కానుకల కోసం దేవాదాయ శాఖ అధికారులు మేడారంలో హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. 452 ఇనుప, 100 క్లాత్ హుండీలను సిద్ధం చేయగా.. సమ్మక్క పేరుతో 200, సారలమ్మ పేరుతో 200, పగిడిద్దరాజు పేరుతో 26, గోవిందరాజు పేరుతో 26 హుండీలను సిద్ధం చేశామని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ తెలిపారు. ఇవేకాకుండా మరో 60 హుండీలు మరమ్మతులో ఉన్నాయన్నారు. వీటితోపాటు వంద క్లాత్ హుండీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటన్నిటికీ తాళాలు వేసి సీల్ చేసి.. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, మేడారం ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సంతకాలతో ఉన్న పేపరు అంటించారు.

క్షేత్ర స్థాయి సిబ్బందితో పనులు చేయిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది

• మండల సభలో ఎంపీడీవో శ్రీనివాస్



సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో



వైద్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ వీరన్న

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 17 : అధికారులు తమ కిందిస్థాయి సిబ్బందితో క్షేత్ర స్థాయిలో పనులు చేయిస్తేనే ప్రభుత్వ ఫలాలు ప్రజలకు చేరాలనే లక్ష్యం నెరవేరుతుందని నర్సంపేట ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమావేశహాల్‌లో శనివారం ఎంపీపీ మోతె కళావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులనుద్దేశించి ఎంపీడీవో మాట్లాడారు. అధికారులు తాము పనిచేయడంతో పాటు తమ శాఖలో పనిచేసే కిందిస్థాయి సిబ్బందిని అంకిత భావంతో పనిచేయిస్తేనే ప్రజలకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చేరుతాయన్నారు. ప్రధానంగా వైద్య శాఖలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల పనితీరు సరిగా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 57రకాల రక్తపరీక్షలు చేస్తున్నప్పటికీ పేద ప్రజలకు సమాచరం తెలియక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. మెడికల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించి ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు విధులు సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజుపేట ఎంపీటీసీ వీరన్న మాట్లాడుతూ రాజుపేట, కమ్మపల్లి గ్రామాల్లో నూతన సబ్ సెంటర్ల భవన నిర్మాణాలు పూర్తయినప్పటికీ ప్రారంభించడంలో అలసత్వం ప్రదర్శించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పందించిన ఎంపీపీ కళావతి సబ్ సెంటర్‌లను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ అరుణ్‌కు సూచించారు.అనంతరం సభలో విద్య, వ్యవసాయం, ఉద్యానవనశాఖ, ఇందిర క్రాంతి పథకం తదితర శాఖలపై చర్చ జరిగింది. ఈ సభలో తహసీల్దార్ విశ్వప్రసాద్, ఎంపీవో సునీల్‌కుమార్ రాజ్, వివిధ శాఖ అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



నర్సంపేట బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 17 : మాజీ సీఎం కేసీఆర్ సుపరిపాలన అందించిన పరిపాలనాదక్షుడని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. కేకును కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని పెద్ది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించిన శానబోయిన రాజ్‌కుమార్, రక్తదానం చేసిన బీఆర్ఎస్ శ్రేణులను అభినందించారు. కార్యక్రమంలో ఓడీసీ ఎంఎస్ చైర్మన్ గుగు లోతు రామస్వామినాయక్, బీఆర్ఎస్ నియోజవర్గనాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి నల్లమనోహర్‌రెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నామాల సత్యనారాయణ, మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : ఇల్లంద, కట్ర్యాల, కొత్తపెల్లి, బండౌతపురం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, యూత్ ప్రెసిడెంట్ పొనుగోటి చందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : కేసీఆర్ జన్మదిన వేడుకలను నెక్కొండలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జరిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంగని సూరయ్య, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్, నెక్కొండ సొసైటి చైర్మన్ మారం రాము, నాయకులు తాటిపల్లి శివ, కొనిజేటి భిక్షపతి, యాకయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

• రాయపర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో శనివారం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మునా వత్ నర్సింహనాయక్, ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగుకుమార్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డిలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పూస మధు, ఎండీ నయీం, గబ్బెట బాబు, గారె నర్సయ్య ఎంపీటీసీ ఐత రాంచందర్, చెవ్వ కాశీనాథం పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : మున్సిపాలిటీ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదిన కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ చైర్మన్ ఆంగోతు అరుణ, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి పాల్గొన్నారు. కాగా, సిద్దిపేట జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరును పెట్టాలని దళిత నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

• ఖానాపురం : మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్‌గుగులోతు రామస్వామి నాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, జడ్పీటీసీ బత్తిని స్వప్నశ్రీనివాస్‌గౌడ్, వెంకట నర్సయ్య, వెంకన్న పాల్గొన్నారు.

• చెన్నారావుపేట మండలం కేంద్రంలోని కేసీఆర్ జన్మదినం సందర్భంగా కెక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, మాజీజడ్పీటీసీ రాంరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్య, బాల్నె వెంకన్నగౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎంఎ గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి: గిర్నిబావిలో కేసీఆర్ జన్మదిన కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, ఊరటి మహిపాల్‌రెడ్డి, గుండెకారి రంగారావు, ముదిరకోల కృష్ణ, మెరుగు రాంబాబు, జగన్నాథం, సంజీవరెడ్డిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి విద్య ముఖ్యం


నెక్కొండ, ఫిబ్రవరి 17 : పాఠశాలల విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఎంతో ముఖ్యమని ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకొని క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలని మండల నోడల్ అధికారి బి.రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని పెద్దకొర్పోలు కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో మార్చిలో జరుగనున్న పదవ తరగతి ఇంటర్నసల్ మార్కులను పరిశీలించారు. రికార్డుల పరిశీలన కొన్ని చోట్ల వ్యత్యాసాలను గుర్తించిన ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ మార్కుల బృందం బి.శ్రావన్‌కుమార్, కే.ఇమ్మానుయేలు, పెద్దకొర్పోలు హై స్కూల్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఆర్‌పీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట : పది విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాను మండలంలోని కోనాపురం, లింగాపురం, ఉప్పరపల్లి హై స్కూల్, కేజీబీవీలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అధికారులు బైరీ సరళ, పాపమ్మలు పాఠశాలల్లో రికార్డులను పరిశీలించటం జరిగింది. విద్యార్థులకు వేసిన ఇంటర్నల్ మార్కులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి రవి, వేముల కిషోర్, ఎర్ర రవిందర్, వేముల కిషోర్, జగన్మోహన్ సంతోష్ పాల్గొన్నారు.

త్వరలో జూ పార్కుకు పెద్దపులి, అడవి దున్న

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: వరంగల్ నగరంలోని కాకతీయ జూ పార్కుకు త్వరలో పెద్దపులి, అడవి దున్నను సందర్శకులకు ప్రదర్శనగా ఉంచాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏప్రిల్ 1 నుంచి జూ పార్కులో పెద్దపులితోపాటు అడవి దున్న, మరో రెండు రకాల జింకలను సందర్శకులకు అందుబాటులో ఉంచుతామని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ పర్గేయిన్ తెలిపారు. ప్రస్తుతం జూ పార్కులో ఉన్న సౌకర్యాలు అదనపు ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. జూ పార్కులో కొత్తగా ఏర్పాటు చేసిన పక్షుల కేంద్రాన్ని బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించారు. గూడూరు అటవీ డివిజన్ ప్రాంతంలో పులిమడుగు గ్రామం వద్ద ఏకో టూరిజం క్యాంపింగ్‌ను పర్గే ఇన్ ప్రారంభించారు. పాకాల అభయారణ్యం అభివృద్ధి సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్‌కన్జర్వేటర్ భీమా నాయక్, వరంగల్ డీఎఫ్‌వో భూక్యా లావణ్య గూడూరు, మహబూబాబాద్ డివిజన్ అటవీ అధికారులు చంద్రశేఖర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ సలహాదారు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: శ్రీభద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కారా వేణుగోపాల్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు, సీఎం రేవంత్ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ జగన్మోహన్‌రావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఈవీవీ శ్రీనివాసరావు, జి.నాగభూషణం, కె.ప్రవీణ్, ప్రసాదరావు పాల్గొన్నారు.

రైస్ మిల్‌లో తనిఖీలు



రైస్ మిల్లులో విచారణ చేస్తున్న అధికారులు

నెక్కొండ, ఫిబ్రవరి 17 : నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామంలోని మల్లికార్జున రైస్ మిల్‌లో పౌర సరఫరాల శాఖ డీఎం సంధ్య , వరంగల్ డివిజన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వప్న శనివారం విచారణ జరిపారు. రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం నిలువలు ఉన్నాయంటూ,మిల్లు ప్రధాన రోడ్డు పక్కన ఉండటంతో మిల్లులో వడ్లు పడుతున్నప్పుడు వస్తున్న దస్తు (ఉనుక)తో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారనే విషయమై గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టారు. మిల్లులోని బియ్యం నిలువలపై తనిఖీలు నిర్వహించగా రేషన్ బియ్యం లేవనీ అధికారులు తెలిపారు. మిల్లు నుంచి రోడ్డుపైకి దస్తు వస్తున్న విషయంపై సమగ్ర విచారణ జరిపిన అధికారులు నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. దస్తు వల్ల ప్రజల రాక పోకలకు కలుగుతున్న ఇబ్బందులు, జరుగుతున్న ప్రమాదాల గురించి అధికారులకు ఈ సందర్భంగా ప్రజలు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్ వడ్లకు సంబంధించి రైతులకు డబ్బులు అందలేదని, రవాణ చార్జిలను కూడా రైతులకు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. వడ్ల విక్రయాలకు సంబంధించి రూ.2లక్షల వరకూ డబ్బులను రైతులకు చెల్లించామని, విక్రయాలకు సంబంధించి రూ.3లక్షల వరకూ రైతులకు పెడింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామాల్లోని ఐకేపీ సిబ్బంది రైస్ మిల్లుల యాజమాన్యంతో కుమ్మకై రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ రైతులు ఆరోపించారు.కాగా, రైస్ మిల్లు వల్ల కలుగుతున్న ఇబ్బందుల విషయమై ఫిర్యాదు చేసిన రైతులకు అధికారులు తెలుపకుండా విచారణ చేపట్టడంపై రైతులు తమ్మిశెట్టి సాంబయ్య, బక్కి నరేష్, సంపత్ తదితరులు అధికారుల తీరుపై అనుమానం వ్యక్తం చేశారు.

ఇటుకాలపల్లిలో స్వయంపరిపాలన దినోత్సవం

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 17 : నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి తమ సహ విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రధానోపాధ్యాయురాలిగా ఎం.డి. రోష్ని, డీఈవోగా డి. రుత్విక్, ఎంఈవోగా బి. నిఖిల్‌లు వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి. రమాదేవి, గ్రామ మాజీ సర్పంచ్ మండల రవీందర్, ఎస్ఎంసీ చైర్మన్ తాళ్లపెల్లి అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సంపేటలో జిల్లా అదనపు కోర్టును ఏర్పాటు చేయాలి

• న్యాయశాఖ కార్యదర్శి తిరుపతిని కోరిన ఎమ్మెల్యే దొంతి



రెండ్ల తిరుపతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 17 : వరంగల్ జిల్లా నర్సంపేటలో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని సెక్రటరియేట్‌లో శనివారం నర్సంపేటకు చెందిన పలువురు న్యాయవాదులతో కలిసి న్యాయశాఖ కార్యదర్శి రెండ్లతిరుపతి ని ఎమ్మెల్యే కలిశారు. నర్సంపేటలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు అవశ్యకతపై న్యాయశాఖ కార్యదర్శితో ఎమ్మెల్యే చర్చించారు. తప్పని సరిగా నర్సంపేటలో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయనను ఎమ్మెల్యే మాధవరెడ్డి కోరారు. దీంతో స్పందించిన న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి హై కోర్టు అనుమతితో నర్సంపేటలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు చేసే విధంగా చూస్తానని ఆయన ఎమ్మెల్యే మాధవరెడ్డికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సంపేటకు చెందిన న్యాయవాదులు కొడిదెల సంజయ్‌కుమార్, అంబరి రాజ్‌కుమార్‌తో పాటు నర్సంపేట నియయోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు పాల్గొన్నారు.

రేపు జ్ఞానసరస్వతీ దేవి విగ్రహావిష్కరణ

పర్వతగిరి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జ్ఞానసర స్వతి దేవి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ బాధ్యులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 1987-88 పదవ తరగతి పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో నిర్మించిన విగ్రహాన్ని ఉదయం 9 గంటలకు ఆవిష్కరించేందుకు గాను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు. ఈ మేరకు విగ్రహ ఏర్పాటుకు అనుమతి కోరుతూ ఉపాధ్యాయులకు దరఖాస్తు చేశారు.

5కె రన్, బరువు లాగడం పోటీలు

పర్వతగిరి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా జిల్లాస్థాయి 5కె రన్, బరువు లాగడం పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మార్చి 7వ తేదీన ఉదయం 9 గంటలకు 5కె రన్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.40వేలు, ద్వితీయ రూ.30వేలు, తృతీయ రూ.20వేలు, నాలుగవ బహుమతి రూ.10వేలు అందించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు బరువు లాగడం పోటీలను నిర్వహించనున్నామని, ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ రూ.30వేలు, తృతీయ రూ.20 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు అందించనున్నట్లు తెలిపారు. పరుగు పందెంలో ఒక్కో జట్టులో ఆరు గురు సభ్యులు ఉండాలని, బరువులాగడం పోటీల్లో ఒక్కో జట్టులో 20 మంది సభ్యు లు ఉండాలని వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 28వ తేదీ లోపు ఒక్కో జట్టుకు రూ.1000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9573879358, 9640108335 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నల్లబెల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లోని విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించామని నల్లబెల్లి ఎస్సై నైనాల నగేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో బేటీ బచావో బేటీ పడావో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నగేష్ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీస్ సేవలను తెలిపామన్నారు. అలాగే డయల్ 100 సేవలను కూడా సమగ్రంగా విద్యార్థులకు తెలియజేశామన్నారు. వివిధ నేరాలపై అవగాహనతో పాటు, ఏలా జాగ్రత్త పడాలో తెలిపామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పావని, హర్షిత, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధి కోసం అధికారులు పనిచేయాలి

నల్లబెల్లి, ఫిబ్రవరి 17: మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు పనిచేయాలని జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పెద్ది స్వప్న మాట్లాడుతూ.. ప్రతి గ్రామాన్ని అధికారులు అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలన్నారు. అంతేకాక, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీపీ ఊడుగుల సునీత, ఎంపీడీవో నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ గందె శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా కళలను కాపాడుకోవాలి



నెక్కొండలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నెక్కొండ, ఫిబ్రవరి 17 : కల కోసం కళకాదు.. కళ ప్రజల కోసమని నమ్మి ఎంతో మంది ప్రజా కళాకారులు కొవ్వొత్తులా కరిగిపోతూ సమాజానికి వెలుగునిస్తున్నారని తెలంగాణ ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యులు గన్నారపు రమేశ్ అన్నారు. శనివారం నెక్కొండలోని పనికర గుట్ట వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజానికి కళలు జీవితంలో అంతర్భాగమేనని అంతరించిపోతున్న ప్రజా కళలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. యువత చేడు మార్గంలో పయనించకుండా ఉండుటకు గాను పల్లె సుద్దులే, గొల్ల సుద్దులు, ఉగ్గు కథ , బుర్రకథపై యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షకార్యదర్శులు దామోర కృష్ణ, రాంపల్లి నరేష్ , కళాకారులు సుమలత, మైదం యాకయ్య, నీరేటి రజిత, ఫయాజ్, వెంకటలక్ష్మి, ఎల్లయ్య, సావిత్రి, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట, ఫిబ్రవరి 17 : పోస్టాఫీసు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట పోస్టుమాస్టర్ దార్లరాజేందర్ కోరారు. పోస్టల్ సూపరింటిండెంట్ ఎస్‌వీఎల్ఎన్‌రావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఆదేశాల మేరకు పట్టణంలోని పోస్టాఫీసు ఆవరణలో శనివారం పోస్టల్ పథకాలపై అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టాఫీసులో అనేక రకాల పథకాలు అత్యధిక వడ్డీరేట్లను కలిగి ఉన్నాయన్నారు. సేవింగ్స్ ఖాతా, రికరవరింగ్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు, బాలికలకు సుకన్య ఖాతాలు, అబ్బాయిలకు పీపీఎఫ్ ఖాతాలు, సీనియర్ సిటిజన్స్ కోసం ఖాతాలు, మహిళలకు మహిళా సమ్మాన్‌సేవింగ్స్ ఖాతాలు, కెవిపి ఖాతాలు అనేక రకాల ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇంటింటి ప్రచారం పోస్టల్ సిబ్బంది చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్లు సురేశ్, రాజన్, వీరభద్రయ్య, సురేశ్, సంపత్‌కుమార్, అనూష. కృష్ణ, కిషోర్, శ్రీకాంత్, నాగేందర్, రవి. శాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, ఫిబ్రవరి 17 : మండలకేంద్రంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పోగులకొండ వేణు నానమ్మ అనారోగ్యంతో మృతిచెందగా శనివారం ఆ కుటుంబాన్ని రాయపర్తి ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డిలు పరామర్శించారు. వారి వెంట ఎంపీటీసీ ఐత రాంచందర్, పూస మధు, సుధాకర్, రంగన్న, సతీష్ తదితరులు ఉన్నారు.

భర్తను హతమార్చిన భార్య

(5వ పేజీ తరువాయి

ఉన్నా రు. కుమార్తెలకు వివాహమైంది. రాజు కుటుంబం వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. తాగుడుకు బానిసైన రాజు డబ్బుల కోసం భార్యని తరచూ వేధిస్తున్నాడు. శుక్రవారం సమ్మక్క దేవుడికి కొలుపు చేసుకోవడంతో ఆ కార్యక్రమానికి కుటుంబసభ్యులంతా హాజరయ్యారు. రోజులాగే శుక్రవారం అర్ధరాత్రి డబ్బుల కోసం భార్యతో రాజు గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య లక్ష్మీ, కుమారుడు సూర్య, కుమార్తె మాధవి, అల్లుడు రాకేశ్, బంధువు తరుణ్ కలిసి రాజును రాళ్లతో కొట్టి ఊరి తీసి చంపారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ పరమేశ్ శనివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదుతో ఆ ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.